## సిఎం ఇలాకా కొడంగల్‌లో అప్రకటిత విద్యుత్ కోతలు

**కొడంగల్, జూన్ 17, ప్రభాతవార్త:**
ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో అప్రకటిత విద్యుత్ కోతలపై ప్రజలు అసహనం వ్యక్తంచేస్తున్నారు. ప్రతినిత్యం గంటల తరబడి విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓపక్క రెప్పపాటు అనధికారికంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పాడకుండా చర్యలు తీసుకోవాలని సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీచేసినా, విద్యుత్ అధికారులు మాత్రం సిఎం ఆదేశాలను బేఖాతరు చేస్తూ ప్రతి రోజు గంటల తరబడి అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తుండడం గమనార్హం. వారంలో ఏదో ఒకరోజు మరమ్మతుల పేరుతో గంటల తరబడి విద్యుత్ కోతలు విధిస్తున్న విద్యుత్ అధికారులు ప్రతి రోజు చీటికిమాటికి విద్యుత్ కోతలు విధిస్తుండడం పట్ల పట్టణ ప్రజలు విద్యుత్ అధికారుల తీరుపై మండిపడుతున్నారు. విద్యుత్ కోతలు లేకుండా విద్యుత్ సరఫరా జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## ప్రైవేటు పాఠశాలల ఫీజులు నియంత్రించాలి

-డివైఎఫ్ఐ జంగయ్య

**యాచారం, జూన్ 17, ప్రభాతవార్త:**
ప్రైవేటు విద్యాసంస్థల్లో ఇష్టానుసారంగా వసులు చేస్తున్న ఫీజులను అరికట్టాలని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అలంపల్లి జంగయ్య డిమాండ్‌చేశారు. మంగళవారం యాచారం మండల కేంద్రంలో జంగయ్య విలేకరులతో మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలలో యజమాన్యం ఇష్టానుసారంగా వసూలు చేస్తున్న ఫీజులు ఆరికట్టాలని పాఠశాలలో విద్యాహక్కు చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రైవేటు పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులకు ఉచితవిద్యను అందించాల్న చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్‌చేశారు. ప్రైవేటుపాఠశాలలో పుస్తకాలు నోటుపుస్తకాలు యూనిఫామ్ పేరుతో ఇష్టానుసారంగా ఫీజులను వసూలుచేస్తున్నారని ఆరోపించారు. జిల్లావిద్యాధికారి, మండలవిద్యాధికారి నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, ప్రైవేట్ పాఠశాలలపై తీరు మారకపోతే ఆందోళన తప్పదని హెచ్చరించారు.

## ఆర్థిక పరిస్థితి బాగులేకున్నా పక్కాగా గ్యారంటీ పథకాల అమలు

-ప్రభుత్వ ఛీఫ్ విప్ (ఎమ్మెల్సీ) డాక్టర్ పి.మహేందర్‌రెడ్డి
-పాల్గొన్న ఎంపి, ఎమ్మెల్యే, పార్టీ ఇన్‌చార్జి, అధికారులు,నాయకులు



చెక్కులను పంపిణీచేసిన ప్రభుత్వ ఛీఫ్‌విప్ డాక్టర్ పి.మహేందర్‌రెడ్డి పాల్గొన్న ఎంపి, ఎమ్మెల్యే, పార్టీ ఇన్‌చార్జి, అధికారులు, నాయకులు

**శామీర్‌పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), జూన్ 17, ప్రభాతవార్త:**
రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి బాగులేకున్నా ప్రజలకు హామీలు ఇచ్చిన గ్యారంటీ పథకాలు పక్కాగా అమలు చేయటం జరుగుతుందని రాష్ట్రప్రభుత్వ ఛీప్‌విప్(ఎమ్మెల్సీ) డాక్టర్ పి.మహేందర్‌రెడ్డి స్పష్టంచేశారు. మంగళవారం మేడ్చల్‌జిల్లా శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీలోని అంతాయిపల్లిలోని ఎస్ఎన్ఆర్‌పుష్పహాల్‌లో మేడ్చల్ నియోజకవర్గస్థాయిలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ డాక్టర్ పి.మహేందర్‌రెడ్డి, మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్, రాష్ట్రనాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ బి.శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర హజ్‌కమిటీ మెంబర్ ఎండి ముజీబుద్దీన్, కీసర ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డిలతో కలిసి చెక్కులను పంపిణీచేశారు. మేడ్చల్ నియోజకవర్గంలోని వివిధమండలాల, మున్సిపాల్టీల లబ్ధిదారులు 805మందికి 5లక్షల 93వేల 380రూపాయల కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను పంపిణీచేయటం జరిగింది. ఇక మేడ్చల్‌మండలంలో 139మందికి కోటి 39లక్షల16వేల124 రూపాయలు, శామీర్‌పేటమండలంలో 71మందికి 71లక్షల8వేల236రూపాయలు, మూడుచింతలపల్లి మండలంలో 27మందికి 27లక్షల3వేల 132రూపాయలు, కీసర మండలంలో 136మందికి కోటి 36లక్షల15వేల776రూపాయలు, కాప్రా(జవహర్‌నగర్)మండలంలో 81మందికి 81లక్షల 9వేల396రూపాయలు, ఘట్‌కేసర్‌మండలంలో 131మందికి కోటి31లక్షల15వేల 196రూపాయలు, మేడిపల్లి మండలంలో 220మందికి 2కోట్ల20లక్షల25వేల520రూపాయల విలువగల చెక్కులను వారు పంపిణీచేశారు. ఈసందర్భంగా రాష్ట్రప్రభుత్వ ఛీప్‌విప్ పి.మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఎన్నికలముందు హామీలు ఇచ్చినవిధంగా గ్యారంటీ పథకాల అమలు జరుగుతుందని, పేదలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పేదలకు ఆర్థికంగా చేయూతనివ్వటానికి ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మేడ్చల్ నియోజకవర్గ స్థాయిలో మండలాల, మున్సిపాల్టీల లబ్ధిదారులకు చెక్కులను పంపిణీచేయటం సంతోషంగా ఉందన్నారు. అన్ని జిల్లాలతో పాటు మేడ్చల్, రంగారెడ్డి, వికారబాద్ జిల్లాల రైతాంగానికి రైతుభరోసాను అందించటానికి సిఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమపథకాలు అందించనున్నట్లు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి సూచించారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు తగ్గించి సంయమనం పాటించి రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బి.శ్రీనివాస్‌రెడ్డి, కీసర ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి, రాష్ట్ర హజ్‌కమిటీ మెంబర్ ఎండిముజీబుద్దీన్, మండలాల తహసీల్దార్లు యాదగిరిరెడ్డి, వెంకటనర్సింహ్మారెడ్డి, అశోక్, రజిని, సుచరిత, హసీన, బ్లాక్ అధ్యక్షులు జి.వేణు గోపాల్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, ఆయా మండలాల,మున్సిపాల్టీల కాంగ్రెస్ అధ్యక్షులు బి.జైపాల్‌రెడ్డి, వై.శంకర్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, రమణారెడ్డి, నాయకులు ఎద్దు నాగేశ్‌యాదవ్, గడ్డం రమేశ్, తుంకి రమేశ్, కె.కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పలువురు కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ

-జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి



భూమిపూజచేసిన జిల్లా ఆర్టీఏమెంబర్ బి.జైపాల్‌రెడ్డి, అధికారులు, నాయకుల దృశ్యం

**శామీర్‌పేట, జూన్ 17, ప్రభాతవార్త:**
అంతాయిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొని భూమిపూజ చేశారు. మంగళవారం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీలోని అంతాయిపల్లిలో ఇందిరమ్మ ఇళ్లనిర్మాణాలకు భూమిపూజ నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా ఆర్టీఏ మెంబర్, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు బి.జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదోడి సొంతింటి కలను నెరవేర్చటానికి ఇందిరమ్మ ఇళ్లను పేదలకు మంజూరు చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేసుకోవాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో హౌజింగ్ ఎఇ కమలాకర్, వార్డు ఆఫీసర్ మహేందర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కత్తి రమేశ్, రాజబోయిన శ్రీనివాస్‌యాదవ్, వజ్జల శశాంత్, వార్డు యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేశ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## భూభారతి కొత్త చట్టం ద్వారా రెవెన్యూ సమస్యలు పరిష్కారం

-తహసీల్దార్ శ్రీనివాస్




రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

**కోట్‌పల్లి, జూన్ 17, ప్రభాతవార్త:**
భూసమస్యల పరిష్కారానికి తెలంగాణ రాష్ట్రప్రభుత్వం భూభారతి కొత్త చట్టం 2025 తీసుకువచ్చిందని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కోట్‌పల్లి మండల పరిధిలోని నాగసాన్‌పల్లి గ్రామపంచాయతీలో భూభారతి రెవె న్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈసదస్సులో తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించే సమస్యల ను దరఖాస్తు చేసుకుంటే అప్పటికప్పుడే పరిష్కరించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఆర్డిఓ స్థాయిలో కూడా పరిష్కరించేందుకు వీలుంటుందని తెలిపారు. ఈభూభారతి రెవె న్యూ సదస్సుల ను రైతన్నలు సద్వినియోపరుచుకొని లబ్ధిపొందాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ భాగ్యలక్ష్మి, సిబ్బంది, జగదీష్, సంతోష్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం.. కొను‘గోల్‌మాల్’ !

**వికారాబాద్‌జిల్లాప్రతినిధి, జూన్ 17, ప్రభాతవార్త:**
రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలపై దళారులు గద్దల్లా వాలిపోయారు. నాణ్యత సాకుచూపుతూ కొనుగోలుకేంద్రాల వద్ద నిలువు దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా రైతన్నలవ్యధ తీరడంలేదు. మార్కెట్లో వ్యాపారుల బారినుంచి రైతులను ఆదుకోవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసినా అక్కడాదాపురించారు. వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వ అనుబంధ సంస్థలకు అప్పగించినా ఎలాంటి మార్పులు కనిపించడంలేదు. పక్కా వ్యూహరచనతో కొనుగోలుకేంద్రాల వద్ద రైతులను మోసాలకు గురి చేస్తున్నారు.

యాసంగి ధాన్యంపై ఎప్పటిలాగే ఈసారి కూడా వాలిపోయారు. జిల్లా కేంద్ర మార్కెటింగ్ సొసైటీ (డిసిఎంఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలలోనే అధికంగా అక్రమాలు వెలుగు చూశాయి. తాండూరు నియోజకవర్గం పరిధిలో యాసంగి ధాన్యం కొనుగోలు చేసేందుకు 14 కేంద్రాలను డిసిఎంఎస్ ప్రారంభించింది. ఇవి కాకుండా ఇతర సంస్థలకూ సెంటర్ల బాధ్యతలు అప్పగించినా డిసిఎంఎస్ సెంటర్లలోనే ఎక్కువగా అక్రమాలు జరిగినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తూకాలు చేపట్టి అందినంత దండుకున్నారని రైతులు మొర పెట్టుకున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల నుంచి బస్తా 41కిలోల బరువు ఉండేలా చూసుకోవాలి. అంతకంటే ఎక్కువగా తూకం వేయడం నిబంధనలకు విరుద్ధం. డిసిఎంఎస్‌లో జిల్లా అంతటా కలిపి 20మంది మాత్రమే రెగ్యులర్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. జిల్లాలో ఉన్న నాలుగు నియోజకవర్గాల పరిధిలో అనేక సెంటర్లు ప్రారంభించారు. ప్రస్తుతం జిల్లా సిబ్బంది ద్వారా తాండూరు నియోజకవర్గం పరిధిలో 14 సెంటర్లను నిర్వహించడం సాధ్యం కాదు. దాంతో ప్రైవేటు వ్యక్తులను రంగంలోకి దించి సిబ్బంది కనుసన్నలలో తూకం చేపట్టారు. బస్తా బరువు 41కిలోలు ఉండగా అదనంగా రెండు నుంచి రెండున్నర కిలోలు అదనంగా తూకం వేసినట్లు రైతులు ఆరోపిస్తూ కలెక్టర్ కార్యాలయంలో ఆందోళన చేపట్టారు. అంటే బస్తా బరువు 43 కిలోలు ఉండేలా తూకం వేసుకుని అదనంగా వచ్చిన రెండు కిలోలను సిబ్బంది జేబుల్లోకి వేసుకున్నట్లు అంచనా. జిల్లాలో ఎక్కడా లేనంత చైతన్యం యాలాల మండలం జుంటుపల్లి రైతుల్లో ఉండటం వల్ల అదనపు తూకాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. నాణ్యతలేదంటూ తప్పనిసరిగా 43కిలోల చొప్పున తూకం వేస్తామని సిబ్బంది, ప్రైవేటు సిబ్బంది స్పష్టం చేయడంతో చాలామంది అమాయక రైతులు విక్రయించారు. అయితే, పలువురు యువరైతులు ఈ అక్రమాలను నిలదీశారు. డిసిఎంఎస్ అధికారులకు, సిబ్బందికి వ్యతిరేకంగా ఆందోళనకు నడుం బిగించారు. తాండూరు ప్రాంత రాజకీయ నాయకులు వారికి మద్దతు ఇవ్వకపోవడంతో బిసి కమిషన్ మాజీ సభ్యుడు నూలి శుభప్రద్‌పటేల్‌ను ఆశ్రయించారు. ఆయన నాయకత్వంలో రైతులు పెద్ద ఎత్తున కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి న్యాయం కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ అక్రమాలపై విచారణ జరిపించాలని కోరారు. అందుకు స్పందించిన ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. కానీ ఇప్పటివరకు నివేదికలు ఇవ్వలేదని సమాచారం.

ఏప్రిల్ మాసంలో యాసంగి కొనుగోలు సెంటర్‌లను ప్రారంభించారు. ఇప్పటివరకు డిసిఎంఎస్ నిర్వహణలో తాండూరు నియోజకవర్గంలోని 14సెంటర్లలో 4లక్షల ధాన్యంబస్తాలు కొనుగోలు చేశారు. అంటే, లక్షా60వేలక్వింటాళ్లు కొనుగోలుచేశారని అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ప్రతి బస్తాపై అదనంగా సేకరించిన 2 కిలోల అక్రమధాన్యం బరువే సుమారు ఏడు నుంచి 800 క్వింటాళ్ల వరకు ఉంటుందని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం ద్వారా నిర్వహణ ఏజెన్సీలకు వచ్చే కమిషన్ మాత్రమే కాకుండా మధ్యవర్తులకు కూడా 10నుంచి 15లక్షలవరకు చేరిపోయిందని మండిపడుతున్నారు. ఇలా కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులను నిలువునా మోసంచేస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేస్తున్నారు.

మరోవైపు జుంటుపల్లి కేంద్రంలో జరిగిన ఆందోళనపై స్థానిక యువకులు గ్రామస్థులకు పలు హెచ్చరికలు జారీచేసిన ఆడియో ఒకటి బయటపడింది. డిసిఎంఎస్ సిబ్బంది వచ్చి మాయమాటలు చెబితే ఎవరూ లొంగిపోవద్దని సూచించారు. ఉన్నతాధికారుల విచారణలో వాస్తవాలు వెల్లడించాలని సూచించారు.

ఇలా ఉండగా ధాన్యం కొనుగోలులో జరిగిన అక్రమాలపై వాస్తవాలు వెలుగు చూశాయని, అధికారులు సరైన నివేదికలు అందజేయాలని టిఆర్ఎస్ సీనియర్‌నేత, బిసి కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ డిమాండ్‌చేశారు. జిల్లా కలెక్టర్‌పై తమకు పూర్తివిశ్వాసం ఉందన్నారు. విచారణాధికారులు ఒకవేళ నివేదికలు తారుమారు చేస్తే ఉపేక్షించబోమని స్పష్టంచేశారు.

**డిసిఎంఎస్ ఇన్చార్జ్ మేనేజరు వివరణ..**
తూకాల్లో ఎలాంటిమోసాలు జరుగలేదని డిసిఎంఎస్ తాండూరుశాఖ ఇన్చార్జ్ మేనేజరు సలామ్ పాష వివరణ ఇచ్చారు. తడిసినధాన్యంపై నిబంధనలు అమలుచేయాలని ప్రయత్నించామని తెలిపారు. అదనంగా2కిలోలు తూకంవేసినట్లు ఎక్కడా ఆధారాలులేవన్నారు. ఈవివాదం ముగిసిందని తాను భావిస్తున్నానని ఆయన వివరించారు.

-ప్రభుత్వ నిబంధనలకు పాతర-రైతన్నలకు డిసిఎంఎస్ టోకరా
-విచారణలో నిజాలు నిర్ధారణ ఖాయం: శుభప్రద్‌పటేల్



కలెక్టర్ కార్యాలయం వద్ద జుంటుపల్లి రైతులతో బిసి కమిషన్ మాజీ సభ్యుడు

## బాక్స్ డ్రైనేజీ పనుల్లో నాణ్యత పాటించాలి



బాక్స్‌డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఎంపి ఈటల రాజేందర్

**కీసర, జూన్ 17, ప్రభాతవార్త:**
బాక్స్ డ్రైనేజీ పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యత పాటించాలని మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని బిఎంఆర్ కాలనీలో హెచ్ఎండిఏనిధులు 9కోట్ల90లక్షలు మంజూరు అయ్యాయని నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఎంపి మాట్లాడుతూ బాక్స్ డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. కాంట్రాక్టర్ పనుల్లో నాణ్యత పాటించకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు విక్రంరెడ్డి, నాగారం మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు అన్నంరాజు సురేష్, నక్క కిషోర్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైకల్యం కలవారికి ధ్రువీకరణ పత్రాలు అందజేయాలి

-జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

**వికారాబాద్‌జిల్లా ప్రతినిధి, జూన్ 17, ప్రభాతవార్త:**
అంగవైకల్యానికి సంబంధించి అర్హులైన ప్రతి ఒక్కరికీ రెండు మాసాల్లోపు ధ్రువీకరణ పత్రాల ు అందజేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారుల ను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో సదరం, యుడిఐడి శిబిరాల నిర్వహణపై డిఆర్డీఓ, వైద్యశాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా అధికారుల ను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో అంగవైకల్యంతో కూడిన ప్రతి ఒక్కరికీ సదరం, యుడిఐడి శిబిరాల ద్వారా ధ్రువీకరణ పత్రాలు అందజేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో వెయిటింగ్ జాబితాలో వివిధ వైకల్యాలతో కూడిన 689 అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేసేందుకు వీలుగా అధిక శిబిరాల ు ఏర్పాటు చేసి ధ్రువీకరణ పత్రాలు అందజేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. క్యాంపులకు విచ్చేసిన ప్రతి ఒక్కరికీ పరీక్షలు నిర్వహించి సంబంధిత ధ్రువీకరణ పత్రాల ు అందజేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో డిఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ రాంచంద్రయ్య, కొడంగల్, వికారాబాద్ వైద్య కళాశాలల ప్రిన్సిపల్స్ పద్మ, మల్లికార్జున్, డిపిఎం నర్సింలు, ఎపిఎం కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

## కుంటలో జరుగుతున్న పనులను ఆపాలి

-హైడ్రాను కోరిన భూముల పరిరక్షణ సమితి ప్రతినిధులు



భూముల పరిరక్షణ సమితి ప్రతినిధులు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేసిన దృశ్యం

**శామీర్‌పేట, జూన్ 17, ప్రభాతవార్త:**
తూంకుంట మున్సిపాల్టీలోని దేవరయాంజాల్ గ్రామ పరిధిలోని తురకోనికుంట శిఖం భూమిలో లారీల బరువును లెక్కకట్టే వెయింగ్ మిషన్ ఏర్పాటు చేస్తున్నారని వెంటనే ఆ పనులను నిలిపివేయాలని దేవరయాంజాల్ శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం భూముల పరిరక్షణ సమితి ప్రతినిధులు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి కోరారు. శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీలోని దేవరయాంజాల్‌లోని తురకొని కుంట లేయింగ్ మిషన్ ఏర్పాటు చేస్తున్నారని, దేవస్థానం భూములు కూడ కబ్జాకు గురవుతున్నాయని కాపాడాలని కోరుతూ హైడ్రా కమిషనర్‌ను కోరటం జరిగిందని ప్రతినిధులు పేర్కొన్నారు. దేవరయాంజాల్ చెరువుకు వెళ్లాల్సిన వరద కాలువను మళ్లించటంతో ఊరు నుంచి వచ్చే మురుగునీటి ప్రవాహానికి ఆటంకంగా మారుతుందని పలువురు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. వరదనీటి కాలువ నేరుగా చెరువులోకి వెళ్లేలా ఏర్పాటుచేస్తే గ్రామానికి వరదముప్పు తప్పుతుందని హైడ్రాకు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రజా అవసరాల స్థలాలను కాపాడుతున్నామని, పాత లేవుట్లలో రోడ్లు, పార్కుల స్థలాలను కాపాడుతూనే ఉన్నామని, అమాయకులు మోసపోకుండా కూడా తగు చర్యలు తీసుకుంటున్నామని, కుంటలో జరుగుతున్న పనులపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నట్లు భూముల పరిరక్షణ ప్రతినిధులు పేర్కొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి అదృశ్యం

**కేశంపేట, జూన్ 17, ప్రభాతవార్త:**
కేశంపేట మండల పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన మామిడి శివ (సిటీ కేబుల్ శివ) ఈనెల 12వ తేదీ నుండి కనిపించడం లేదని, ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయారని అతని తల్లి మామిడి అనసూయ మంగళవారం కేశంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని, మామిడి అనసూయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ నరహరి తెలిపారు.

## చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి

**దౌల్తాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:**
చేపల వేటకు వెళ్లి ఓవ్యక్తి మృతిచెందిన సంఘటన వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలంలోని తిరుమలాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. దౌల్తాబాద్ ఎస్సై రవిగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తిరుమలాపూర్ గ్రామానికి చెందిన చిన్నబాయి జైపాల్(32) ఆదివారం ఉదయం గ్రామ సమీపంలోని చెరువుకు చేపలు పట్టడానికి వెళ్లి సాయంత్రం అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతకగా చెరువు ఒడ్డుపై బట్టలు కనిపించాయి. మృతుడు జైపాల్ జాడ తెలియలేదు. మంగళవారం తెల్లవారుఝామున సుమారు ఆరుగంటల సమయంలో తిరుమలాపూర్ సమీపంలోని చెరువులో నీటిపై తేలియాడుతున్న శవం గ్రామస్థులకు కనిపించింది. ఇది గమనించినవారు మృతుడి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన సంఘటన జరిగిన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గ్రామస్థుల సహాయంతో బయటకు తీశారు. శవపంచనామా నిమిత్తం మృతదేహాన్ని కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని, మృతుడిభార్య చిన్నబాయి శాంతమ్మఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై రవిగౌడ్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి మరొకరి పరిస్థితి విషమం

**కొడంగల్, జూన్ 17, ప్రభాతవార్త:**
ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొట్టిన సంఘటనలో ఒకరు మృతిచెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. సంఘటనకు సంబంధించి ఎస్సై జివి.సత్యనారాయణ కథనం మేరకు..హైద్రాబాద్‌లోని హయత్‌నగర్‌కు చెందిన శివకుమార్(26) శ్రీశైలం వెళ్ళేందుకు కోస్గిలోని తన మిత్రుల వద్దకు వస్తున్నాడు. ఈక్రమంలో హైద్రాబాద్ నుంచి పరిగి వరకు ఆర్టీసీ బస్సులో వచ్చారు. అక్కడి నుంచి కోస్గి వెళ్లేందుకు బస్సు లేకపోవడంతో పరిగిలో కొడంగల్ వైపు వెళ్తున్న రావులపల్లి గ్రామానికి చెందిన రవి కారులో లిఫ్ట్ అడిగి ఎక్కాడు. ఆయనతో పాటు మరో గుర్తుతెలియని వ్యక్తి కారులో ఎక్కి కొడంగల్ వస్తుండగా పట్టణ శివారులోని రాఘవేంద్ర ఆసుపత్రి సమీపంలో ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ సంఘటనలో కారులో ఉన్న శివకుమార్ అక్కడికక్కడే మృతిచెందగా, రవికి స్వల్పంగా గాయాలయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తి పరిస్థితి విషమంగా ఉండడంతో కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించి మెరుగైన చికిత్స నిమిత్తం హైద్రాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. శివకుమార్ మామ యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

**దౌల్తాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:**
కుటుంబ గొడవలతో క్షణికావేశంలో పురుగులమందు త్రాగి ఓవ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలంలోని గోకఫస్లావాద్ గ్రామంలో చోటుచేసుకుంది. దౌల్తాబాద్ ఎస్సై రవిగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని గోకఫస్లావాద్ గ్రామానికి చెందిన గొల్ల మల్లప్ప(55), తన చెల్లెలు అనంతమ్మ తనకు తెలియకుండా 25గుంటల భూమిని పట్టా చేసుకున్నదని తెలుసుకొని అప్పటినుండి మద్యానికి బానిసై జీవితంపై విరక్తిచెంది క్షణికావేశంలో పొలందగ్గర సోమవారం పురుగులమందు త్రాగి పడిపోగా, ఇది గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన చికిత్స నిమిత్తం మహబుబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స చేస్తుండగా సోమవారం రాత్రి మృతిచెందాడన్నారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## రాజీవ్‌సాగర్‌పై దుష్ప్రచారాన్ని ఆపాలి

**సైఫాబాద్, జూన్ 17 ప్రభాతవార్త:** దళిత సమాజాన్ని నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగా మేడే రాజీవ్‌సాగర్‌పై దుష్ప్రచారం తగదని, తప్పుడు ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, ఇకనైనా కాంగ్రెస్ పార్టీ విషప్రచారాన్ని మానుకోవాలని పలు దళిత క్రిస్టియన్ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఇటీవల ప్రముఖ గాయని మంగీ బర్త్‌డే వేడుకల్లో మేడే రాజీవ్‌సాగర్ ఉన్నారని కొంత మంది చేసిన తప్పుడు ప్రచారాన్ని నాయకులు తీవ్రంగా ఖండించారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రిస్టియన్ జెఎసి ఛైర్మన్ సాల్మన్‌రాజు, క్యాథలిక్ చర్చి అసోసియేషన్ కార్యదర్శి లియోలూయిస్ మాట్లాడుతూ ఇది కేవలం రాజీవ్‌సాగర్‌పై వ్యక్తిగత విమర్శలు కాదని, దళిత క్రిస్టియన్ సమాజాన్ని లక్ష్యంగా చేసుకున్న కుట్రగా ఉందని, ఆయన ప్రజల సంక్షేమానికి ఎంతో కృషి చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నదని విమర్శించారు. క్రైస్తవులు రాజకీయంగా ఎదగకుండా చేసేందుకు ఇదోక ప్రయత్నమని వారు విమర్శించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్‌సాగర్‌పై దుష్ప్రచారాన్ని అపాలని వారు డిమాండ్ చేశారు.

### బాలబాలికలకు అక్షర అభ్యాసం చేయించిన కార్పొరేటర్


అంగన్‌వాడిలో బాలబాలికలకు అక్షర అభ్యాసం

**బేగంబజార్, జూన్ 17ప్రభాతవార్త:** బడి బాట కార్యక్రమంలో భాగంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ కమ్యూనిటిహాల్‌లో అంగన్ వాడి టీచర్లు నిర్వహించిన అక్షర అభ్యాసం కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్‌గొంటి శంకర్‌యాదవ్ పాల్గొన్ని బాలబాలికలకు అక్షర అభ్యాసం చేశారు. ఈకార్యక్రమంలో బేగంబజార్ డివిజన్ బిజెపి అధ్యక్షులు బండ క్రాంతి కుమార్, సుదీర్ సింగ్, శ్రీనివాస్, అంగన్‌వాడి టీచర్లు లక్ష్మి, విద్యావతి, వనితఠాకూర్, లక్ష్మి, గిరిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి : ఆనంద్ కుమార్‌గౌడ్


డిసికి వినతి పత్రం అందచేస్తున్న బిఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్

**అఫ్జల్‌గంజ్, జూన్ 17ప్రభాతవార్త:** ఆషాడ మాసం బోనాల ఉత్సవాలకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని కోరుతూ గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎం.ఆనంద్ కుమార్‌గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గోషామహల్ జిహెచ్ఎంసి సర్కిల్ 14 డిప్యూటి కమీషనర్ లావణ్యకు ఆనంద్ కుమార్‌గౌడ్ బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. గోషామహల్ నియోజకవర్గంలోని ఉన్న దేవాలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరారు. అంతేకాకుండా పండుగనెల రోజుల సమయం ఉంది కాబట్టి ముందుస్తుగా దేవాలయాలవద్ద ప్యాచ్‌వర్క్స్, డ్రైనేజీ సమస్యలను నివారించి అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. జూలై 16,17 తేదిలల్లో చాక్నవాడి, మహారాజ్‌గంజ్ బోనాల పండుగ జరుగుతుందన్నారు. 20,21 తేదిలలో గోషామహల్ నియోజకవర్గంలో పూర్తిగా బోనాల పండుగను నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మహ్మద్ అహ్మద్, నరేష్‌గౌడ్, భజన్‌సింగ్, మహేందర్ పాల్గొన్నారు.

### సిసి రోడ్డు పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయండి


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

**కెపిహెచ్బి కాలనీ, జూన్ 17, ప్రభాతవార్త**
కాల్విన్ కాలనీ డివిజన్లో జరుగుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను విధిగా పాటించాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ సూచించారు. మంగళవారం కాలుని కాలనీ డివిజన్లో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను వెంకటేష్ గౌడ్ పరిశీలించారు. డివిజన్ పరిధిలోని శంషిగుడాలో ఇరవైరెండు లక్షల రూపాయల నిధులతో నిర్మిస్తున్న నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను చేపట్టడం జరుగుతుందని ఈ విషయంలో జి.ఎచ్.ఎం.సి అధికారులు శ్రద్ధ చూపాలన్నారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ పడకుండా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. రోడ్డును మంచిగా లెవెలింగ్ చేసి వర్షపు నీరు నిలిచి పోవడం వంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో నిర్మాణ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాజేందర్, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్ తరాల కోసం మొక్కలు నాటాలి



**అత్తాపూర్ జూన్ 16,ప్రభాతవార్త :**
ప్రధాని నరేంద్రమోడీ పాలనలో దేశం అభివృద్ధి పథంలో దూసుపోతుందని పలువురు బిజెపి నేతలు పేర్కొన్నారు. బిజెపి రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం తల్లి వందనం కార్యక్రమంలో భాగంగా ఉప్పర్ పల్లి గవర్నమెంట్ స్కూల్ ,పోచమ్మ దేవాలయం మరియు బిజెపి పార్టీ కార్యాలయం దగ్గర బిజెపి నేతలు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ....భవిష్యత్ తరాల కోసం ప్రతి మొక్కలు నాటాలని సూచించారు. 11ఏళ్ల పాలనలో దేశం ఎంతో పురోగతి సాధించిందని దేశం ప్రజలు ప్రధాని నరేంద్రమోడీని ఎంతో విశ్వస్తున్నారని అన్నారు. పేదలకు కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందజేస్తుంని కేంద్ర పథకాలను పేద ప్రజలకు వివరించి అర్హులకు అందేలా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్, బొక్క బాల్రెడ్డి ,సత్యనారాయణ ముదిరాజ్, సోల్కర్ రెడ్డి, వనిత రెడ్డి, కీర్తి శ్రీను, శ్రీకాంత్ రెడ్డి, బండారి బాలకృష్ణ, మల్లేష్ చారి, శ్రీనివాస్ రెడ్డి, సురేందర్, అశోక్ రెడ్డి, మోహన్ రెడ్డి, పద్మావతి, స్వప్నరెడ్డి, యాదయ్య, విజయ యాదవ్ తుంగ ఇంద్ర రెడ్డి ,రాజశేఖర్ రెడ్డి, పవన్ ,లడ్డూ, కర్ణాకర్ గౌడ్ నాయకులు పాల్గొన్నారు

## వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి

**-అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి**
**-డిప్యూటీ కమిషనర్ రవి కుమార్**



**అత్తాపూర్ జూన్ 16,ప్రభాతవార్త :**
రాబోయే వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవి కుమార్ పేర్కొన్నారు. మంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో జిహెచ్ఎంసి కమీషనర్ ఆర్.వి. కర్ణన్ ఆదేశాల మేరకు సర్కిల్ పరిధిలో సర్కిల్ లెవల్ మాన్సూన్ ప్రిపరేషన్‌లో భాగంగా లైన్ డిపార్ట్‌మెంట్, వాటర్‌వర్క్స్, ఇంజనీరింగ్ సెక్షన్, ట్రాఫీక్ పోలీసు, వివిధ శాఖలతో డిప్యూటీ కమిటీషనర్ రవి కుమార్ రివ్యూవ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిసి మాట్లాడుతూ....వర్షాకాలం మొదలు కావడంతో కొన్ని ప్రాంతాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయని దింతో రోడ్లపై నీరు నిల్వగా ఉండడంతో ఎక్కడికి అక్కడ చెత్త పేరుకొని ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుందని అన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వర్షనీటిని తొలగిస్తు ట్రాఫిక్ ,ఇతర సమస్యలు రాకుండా చూసుకోవాలని సూచించారు. ఎక్కడైనా సమస్య వస్తే వెంటనే స్పాట్‌కి చేరుకొని మ్యాన్‌హోల్ ఓపెన్ చేయాలన్నారు. రాజేంద్రనగర్ మాన్సూన్ కన్వెర్జెన్స్ గ్రూప్ ఏర్పాటు చేయడం జరిగిందని కాబట్టి ఏదైనా సమస్య వస్తే గ్రూప్‌లో పోస్ట్ చేయాలని అన్నారు. పురాతన భవనాలు గుర్తించి వారిని సురక్షిత ప్రాంతానికి తరలించాలని అదేవిధంగా హైడ్రా నుండి వార్డుకి 9 మంది సిబ్బంది ఉన్నారని కాబట్టి ఏదైనా సమస్య వస్తే వారికి కూడా సమాచారం ఇచ్చి సమస్య పరిష్కరించుకోవాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు.

### ఫోన్ ట్యాపింగ్‌తో వ్యక్తిగత స్వేచ్ఛను భంగం కలిగించడం దుర్మార్గమైన చర్య

**- టిపిసిసి అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం**

**కెపిహెచ్బి కాలనీ, జూన్ 17, ప్రభాతవార్త**
తప్పు చేసిన వారెవరైనా శిక్షార్హులే చట్టం నుండి ఎవరు తప్పించుకోలేరని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో ఫోన్ ట్యాపింగ్‌లో భాగంగా నా వ్యక్తిగత పొలిటికల్ నెంబర్ రెండు ఫోన్ నెంబర్లు ఫోన్ ట్యాపింగ్ అయ్యాయని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ గత బిఆర్ఎస్ పాలనలో 2023 ఎన్నికల సమయంలో నవంబర్ 14 నుండి 30వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా 600 ఫోన్లు ట్యాపింగ్ చేసారని కాంగ్రెస్ పార్టీ నాయకులవి 450 పైన మిగితావి వివిధ రంగాల వారివి ట్యాపింగ్ చేసారని సిఐ చెప్పారని అన్నారు. అందులో నా నెంబర్లు ఉన్నాయని చెప్పారు. ఇందులో కేసీఆర్, ఆనాటి పాలకుల ఆలోచన ప్రతిపక్ష పార్టీలు బ్రతకొద్దని, ట్యాపింగ్ ఆయుధంతో రాజకీయ నేతలను, సినీ ప్రముఖులను, వ్యాపారవేత్తలను, న్యాయమూర్తులను అందరిని బ్లాక్ మెయిల్ చేసి అందరి జీవితాలతో ఆడుకున్నారని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేసి అనేక కుటుంబాలలో చిచ్చు పెట్టి, ప్రతిపక్ష నాయకులకు నిద్రలేకుండా చేసి, వారు చేసే పనులను తెలుసుకోని బ్లాక్ మెయిల్ చేసి రాజకీయంగా వాడుకున్న దుర్మార్గమైన చర్య ఈ తెలంగాణ రాష్టంలో జరిగితే దేశం మొత్తం ఉలిక్కిపడిందని అన్నారు. రాష్టంలో బిఆర్ఎస్ గత 8 ఏళ్లపాటు ఫోన్ ట్యాపింగ్‌లు చేసారని, ఆ నాటి ప్రతిపక్ష నేత, నేటి ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి చెప్పినట్టుగానే అవినీతి చేసిన వాళ్ళని చట్టం ముందు నిలబెడుతా ప్రభాకర్ రావు మీరు ఏ దేశంలో దాక్కున్నా తెలంగాణకు పిలిపిస్తా చట్టం ముందు నిలబెట్టే బాధ్యత నాదని, ఈ రోజు అదే జరుగుతుందని అన్నారు. ఈ ఫోన్ ట్యాపింగ్‌లో ఎస్‌బిఐ మాజీ చీఫ్ ప్రభాకర్ రావుని మిగితా నిందితులందరిని వెంటనే శిక్షించాలని సత్యం శ్రీరంగం డిమాండ్ చేసారు.

## సెల్‌ఫోన్ల దొంగలు అరెస్టు ... రూ.25 లక్షల సొమ్ము స్వాధీనం

**కంటోన్మెంట్, జూన్ 17 ప్రభాతవార్త:** సెల్‌ఫోన్లు దొంగిలిస్తున్న ముగ్గురి నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.25 లక్షల విలువ చేసే సెల్‌ఫోన్లు, 2 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు బేగంపేట్ ఏసిపి పి.గోపాల క్రిష్ణ మూర్తి తెలిపారు. మంగళవారం బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒడిసా రాష్ట్రం జైపూర్‌కు చెందిన గంట చిన్నా (40) దిల్‌సుఖ్ నగర్ నివాసం ఉంటున్నాడు. అదే విధంగా మల్లాపూర్ హౌజింగ్ బోర్డుకు చెందిన ప్రధాన్ శ్రీకాంత్ 22, అవుల గోపిరావు 20, అనే ముగ్గురు వ్యక్తులు నెంబర్ ప్లేట్లులేని రెండు బైక్‌లతో అనుమానస్పదంగా సంచరిస్తున్నారు. ఉప్పల్‌లోని ఫిర్జాదిగూడకు చెందిన రాజ నర్సింహ్మ ఈ నెల 13వ తేదీన మధ్యాహ్నం ఫుట్‌పాత్ సిగ్నల్ దాటుతుండగా బైక్ దగ్గర పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తికి సహాయం చేయడానికి సెల్‌ఫోన్ లాక్కొని పారిపోయాడు. అందులో ఒకరిని పట్టుకొని పోలీసులను అప్పగించారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బేగంపేట ఏసిపి గోపాల క్రిష్ణమూర్తి బోయిన్‌పల్లి సిఐ తిరుపతి రాజు, ఎస్ఐలు

వారినిఅదుపులోకి తీసుకొని విచారించగా 25 లక్షల విలువ చేసే 77 సెల్‌ఫోన్లు, 2 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఏసిపి తెలిపారు. దొంగిలించిన సెల్ ఫోన్లను జహంగీర్ అనే వ్యక్తి వద్ద ఉంచినట్లు తెలిపారు. జహంగీర్ అనే వ్యక్తి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు, డిఐ సర్ధార్ నాయక్‌లు దర్యాప్తు చేస్తున్నారు.

## భోజగుట్టలో కూల్చివేతలు.. కొద్దిసేపు ఉద్రిక్తత

**మెహదీపట్నం, జూన్ 17, ప్రభాతవార్త :** భోజగుట్టలో ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. పెద్ద ఎత్తున పోలీసు బలగాలు భోజగోట్టను చుట్టుముట్టడంతో అక్కడ ఏం జరుగుతుందోనని స్థానికుల్లో ఆందోళన నెలకొంది. భోజగుట్టలో కూల్చివేతలు జరుగుతున్నాయని తెలుసుకున్న కొందరు స్థానికులు పోలీసులను అడ్డుకోవడంతో వారిని అదుపులోకి తీసుకొని కూల్చివేతలు ముగిసిన అనంతరం పోలీసులు వదిలేశారు. ఆసిఫ్ నగర్ మండల పరిధిలోని భోజగుట్టలో గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పేదలకు కట్టించేందుకు ముందుకు వచ్చి ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి కొన్ని ఇండ్లను అసంపూర్తిగానే నిర్మించింది. డబల్ బెడ్ రూమ్ లో విషయంలో శ్రీరామ్ నగర్, శివాజీ నగర్, వివేకానంద నగర్ వాసుల్లో భిన్నాభిప్రాయాలు ఉండడంతో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ పనులను ప్రభుత్వం మధ్యలోనే వదిలేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డబుల్ బెడ్ రూమ్ ల విషయం మళ్లీ తెర మీదికి రావడంతో అధికారులు బొజగుట్టలో డబల్ బెడ్ రూములను నిర్మించేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా భోజగుట్ట వాసులతో జిల్లా కలెక్టర్ అవగాహన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. కొద్దిరోజుల క్రితం డబల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణానికి అనుకూలంగా ఉన్న వారికి ఆసిఫ్ నగర్ మండల రెవెన్యూ అధికారులు పట్టాలను కూడా అందజేసి నిర్మాణ పనులను వేగవంతం చేయడానికి సిద్ధపడుతున్నారు. దీంతో భోజగుట్టలో రవాణా వ్యవస్థకు అడ్డుగా ఉన్న కొన్ని ఇండ్లను మంగళవారం తొలగించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ నగర్ మండల తహసిల్దార్ జ్యోతి మాట్లాడుతూ...భోజగుట్టలో అసంపూర్తిగా మిగిలిపోయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. దారికి అడ్డంగా ఉన్న, రోడ్డును ఆక్రమించి వేసిన దుకాణాలు గుడిసెలను మాత్రం తొలగించడం జరిగిందని తెలిపారు. ఈ విషయంపై ముందస్తుగానే సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు. కుల్సుంపుర, ఆసిఫ్ నగర్ ఏసీపీల ఆధ్వర్యంలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.


భోజగుంటలో రోడ్డుకు అడ్డంగా ఉన్న నిర్మాణాలను తొలగిస్తున్న ఆసిఫ్ నగర్ మండల రెవెన్యూ అధికారులు.

## సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి

**-దోమల నివారణకు కాలనీలు, పార్కులు, చెరువుల్లో ఫాగింగ్ చేపట్టాలి**
**-అధికారులకు జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ఆదేశం**

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:**
సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిహెచ్ఎంసి కమీషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. ఈమేరకు మంగళవారం సాయంత్రం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అడిషనల్, జోనల్, డిప్యూటీ కమిషనర్లు, ఏఎంఅండ్‌హెచ్‌ఓలు, ఎంటమాలజీ అధికారులతో శానిటేషన్, దోమల నివారణ, ఆస్తిపన్ను వసూళ్ల పై కమీషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ దోమల నివారణకు చేస్తున్న ఫాగింగ్ పై అసిస్టెంట్ మెడికల్ అధికారి పూర్తి బాధ్యత ఉంటుందన్నారు. ఫాగింగ్ సాయంత్రం 4 గంటల నుండి 10 గంటల వరకు తప్పని సరిగా చేయాలని, ఏఎల్ఓ లు క్షేత్ర స్థాయిలో యాంటీ లార్వా కార్యక్రమం, ఉదయం, సాయంత్రం ఫాగింగ్ పనులు చేపట్టాలన్నారు. ఫాగింగ్ సర్కిల్ వారీగా అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్, జోనల్ స్థాయిలో ఎస్ ఈ లు బాధ్యత తీసుకోవాలన్నారు.. డెంగ్యూ వ్యాధి ప్రబలిన జాబితా బస్తీ దవాఖానా, పి హెచ్ సి నుండి సేకరించిన వ్యక్తుల ఇంటి నుండి ఎస్ ఓపి కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలని సూచించారు.

**లక్ష్యం మేరకు ఆస్తిపన్ను వసూలు చేయాలి..**


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ఆర్.వి కర్ణన్, అడిషనల్ కమిషనర్లు రఘుప్రసాద్, పంకజ తదితరులు

అలాగే నిర్దేశించిన లక్ష్యం మేరకు ఆస్తి పన్ను వసూలు చేయాలని బిల్లు కలెక్టర్ కు ఇచ్చిన టార్గెట్ మేరకు వసూలు చేయాల్సిందేనన్నారు. రెసిడెంట్ భవనంలో కమర్షియల్స్ చేస్తున్న ఇళ్లను గుర్తించి టాక్స్ వసులు చేయాలన్నారు. అలాగే ట్రేడ్ లైసెన్స్ లేని పక్షంలో టాక్స్ వసూలు చేయాలన్నారు. ప్రతి నెల టాక్స్ పై సమీక్ష నిర్వహిస్తామన్నారు. బౌన్స్ చెక్కులు బేగం పేట్, సరూర్ నగర్‌లో ఎక్కువ వచ్చినందున వాటిని వెంటనే క్లియర్ చేయాలని సంబంధిత డీ.సి లను ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్లు రఘు ప్రసాద్, పంకజ, జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, అపూర్వ చౌహాన్, హేమంత్ సహదేవ్ రావు, రవి కిరణ్, వెంకన్న, డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ మెడికల్ అధికారులు, ఎంటమాలజి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సాహిత్య భోజుడు గోన బుద్ధా రెడ్డి : సిరికొండ మధుసూదనాచారి

**చిక్కడపల్లి, జూన్ 17 ప్రభాతవార్త:** తెలుగులో తొలి సారిగా వాల్మీకి సంస్కృత రామాయణాన్ని రంగనాథ రామాయణం పేరిట అనువదించిన వారు గోన బుద్ధారెడ్డి అని శాసన మండలి లో ప్రతి పక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి అన్నారు. అయన సాహిత్య భోజుడు గా నాటి కాలం గుర్తింపు పొందారని చెప్పారు. మంగళవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ లోని గుండవరపు హనుమంత రావు కళా వేదిక పై గానసభ నిర్వహిస్తున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపర లో భాగంగా తెలుగు కవి గోన బుద్ధారెడ్డి యాది లో పేరిట సంస్మరణ సభ గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మధు సూదనాచారి మాటాడుతూ బుద్ధా రెడ్డి పదమూడవ శతాబ్దికి చెందినవారని, కాకతీయ ప్రభువులకు సామంత రాజు రాయచూర్ పరిగణ ను పాలించారని వివరించారు. తెలుగు సాహిత్యం విశిష్ట పెంచిన ఇట్టి వారి గురించి నేటి తరాలు తెలియజేసేందుకు గానసభ చేస్తున్న సేవ మీడియా సహసకారం అభినంద నీయం అన్నారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ జయరాములు మాట్లాడుతూ ఆంధ్ర మహా భారత రచన చేసిన తిక్కన సమకాలీకు డు


ప్రసంగిస్తున్న శాసన మండలి లో ప్రతి పక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి

బుద్ధ రెడ్డి అని రాణి రుద్రమ దేవి సమకాలికుడు ఐన గోన గన్నారెడ్డి కుమారుడు అని తెలిపారు సరళమైన తెలుగు లో బుద్ధ రెడ్డి రాసిన ఉడత సాయం సీతానేషణం వొక నాడు పాఠాలు గా ఉండేవి అని గుర్తు చేశారు గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై గాయని లక్ష్మీ శాంతి, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రసన్నాంజనేయ స్వామి వార్షికోత్సవ వేడుకలు

**నార్సింగి, జూన్ 17 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ హైదర్షాకోట్ గ్రామం శాంతినగర్‌లో ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ 16.వ, వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వేద పండితుల మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాలు, భక్తుల జయ జయ ధ్వనుల మధ్య కన్నుల పండువగా సాగాయి. మంగళవారం తెల్లవారు ఝామున నుంచే భక్తులు ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక "హనుమాన్ చాలీస పారాయణం" చేశారు. భక్తుల హనుమాన్ చాలిసా పారాయణంతో ఆలయమంతా మారుమ్రోగిపోయింది. ఈ వార్షికోత్సవ వేడుకల్లో మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, మాజీ కార్పోరేటర్ సంతోషి రాజిరెడ్డి, పుర ప్రముఖులు టింకూరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ హిందువులంతా దేవాలయ దర్శనం, భగవద్గీతా, హనుమాన్ చాలీసా పారాయణాలను దినచర్యలో భాగం చేసుకోవాలన్నారు. మన ధర్మంను మనం భక్తి, శ్రద్ధలతో ఆచరిస్తూ ఇతర ధర్మాలను గౌరవించాలన్నారు. పెద్దలు దేవాలయాలకు వెళుతూ తమ బిడ్డలను వెంట తీసుకెళ్లాలని, మన సనాతన ధర్మం గొప్పతనంను తెలియచేస్తుండాలన్నారు. భారతదేశంలో హనుమాన్ ఆలయం లేని గ్రామం లేదని, ప్రతీ గ్రామంలో హనుమాన్ ఆలయం తప్పకుండా ఉంటుందన్నారు. ఈ ఆలయం ఉండడం వల్లనే ఆ గ్రామాల ప్రజలు దుష్ట శక్తుల, పీడల నుంచి సంరక్షింపబడుతున్నారన్నారు. బలానికి, బంటుకి హనుమాన్ మారుపేరని తెలిపారు. మన జీవితంలో ఎన్ని సంకటాలు వచ్చినా జైహనుమాన్ అని తలిస్తే అన్నీ పటాపంచలవుతాయని రాజేందర్‌రడ్డి వివరించారు.


హైదర్షాకోట్ శాంతినగర్‌కాలనీలో ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి దేవలయ 16.వ, వార్షికోత్సవంలో పాల్గొన్న నాయకుల దృశ్యం

### అభివృద్ధి పనులపై కమిషనర్ శరత్‌చంద్ర సమీక్ష



బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ అభివృద్ధిపై సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కమీషనర్ శరత్‌చంద్ర.

**నార్సింగి, జూన్ 17 ప్రభాతవార్త :**
బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై, 100.రోజుల కార్యాచరణ ప్రణాళికలపై కమీషనర్ శరత్‌చంద్ర మంగళవారం అన్ని శాఖల అధికారుల, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలపై వేగంగా స్పందించాలని, జవాబుదారి తనంగా పని చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా వర్షాకాలం కావడం వలన పారిశుద్య సిబ్బంది, కార్మికులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నాలాలు, మ్యాన్ హోళ్ల వలన వరద వచ్చే సమయంలో ప్రాణనష్టం జరుగకుండా చూడాలన్నారు. చెత్త, మురుగు నీరు నిలువ ఉండకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల విచారణ, రాజీవ్ వికాసం దరఖాస్తుల స్వీకరణ, నూతన రేషన్ కార్డుల విచారణ, ట్రేడ్ లైసెన్స్, జనన, మరణ దృశీకరణ పత్రాల జారీ, ఎల్ఆర్ఎస్ సర్వే, అడ్వర్‌టైజ్‌మెంట్ పన్నుల వసూళ్లు, భవన నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల విడుదల, అక్రమ నిర్మాణాలపై చర్యలు, కోర్టు కేసులు, మహిళా సంఘాల ద్వారా స్కూల్ యూనిఫాంస్ తయారీ, నూతన సంఘాల ఏర్పాటు, వివిధ లక్ష్యాల సాధన, ఆస్థి పన్ను వసూళ్లు, వీధి దీపాల నిర్వాహణ, వన మహోత్సవం, నర్సరీల నిర్వాహణ వంటి అంశాలపై అధికారులు, సిబ్బందిని ప్రశ్నించారు. ఈ సమావేశంలో మేనేజర్ మంజులత, డిఇఇ యాదయ్య, ఆర్ఓ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ముష్కిన్ చెరువులోకి మురుగు నీరు రాకుండా చూడాలి

**- మణికొండ బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ**


మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ముష్కిన్ చెరువును సందర్శించిన బిఆర్ఎస్ నాయకుల బృందం

**నార్సింగి, జూన్ 17 ప్రభాతవార్త :** ముష్కిన్ చెరువులోకి మురుగునీరు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మణికొండ బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ పేర్కొన్నారు. మంగళవారం పుప్పాలగూడలోని ముష్కిన్ చెరువును బిఆర్ఎస్ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ 52.ఎకరాలున్న ముష్కిన్ చెరువును పట్టించుకునే వారు లేక ఇప్పుడు కేవలం 12.ఎకరాలకే పరిమితం అయ్యిందని పేర్కొన్నారు. మిగిలిన ఈ చెరువు స్థలం ఇక నుంచి కబ్జా కాకుండా ఉండేందుకు హైడ్రా, హెచ్ఎండిఏ అధికారులను కోరామని తెలిపారు. చెరువు చుట్టూ కట్ట నిర్మించి, పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దాలని డిమాండ్ చేశారు. చెరువులోకి వర్షపు నీటిని తీసుకు వచ్చే వరద కాలువలను కాపాడాలని, డ్రైనేజి నీరు కలువకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన ఈ చెరువు వద్ద అహ్లాదకరమైన వాతావరణంను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నరేందర్, అందె లక్ష్మణ్‌రావ్, విఠల్, సంగం శ్రీకాంత్, శ్రీధర్, ఆరిఫ్, కిరణ్, రామ్, సుమ నళిని, బాబురావ్, ప్రవీన్, బాలాజీ, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### చెరువులను, కుంటలను పరిరక్షించండి: జగదీశ్వర్‌గౌడ్

**శేరిలింగంపల్లి, జూన్17 ప్రభాతవార్త :** చెరువులను, కుంటలను పరిరక్షించటంలో అధికారులు చొరవచూపాలని గ్రేటర్ హైదరాబాద్ స్టాడింగ్ కమిటీ సభ్యులు, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.జగదీశ్వర్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఈర్ల చెరువు పరిసర ప్రాంతాలను జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, డిప్యూటి కమిషనర్ మోహన్‌రెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ.. ఈర్ల చెరువులో మురికినీరు రాకుండా చేపట్టాల్సిన అభివృద్ధి పనులను తక్షణమే చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ ఎస్‌సీ శంకర్‌నాయక్, డీఈ శ్రీదేవి, ఏఈ ప్రతాప్, అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### రోడ్డుకు అడ్డంగా నిర్మించిన గోడను తొలగించాలి


రైల్వే డిజిఎం ఉదయ్‌నాథ్‌కు వినతి పత్రం అందజేస్తున్న రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి, బిజెపి నాయకులు

**మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 17 ప్రభాతవార్త :** శివరాంపల్లి రైల్వే గేట్ రహదారి వద్ద మూసివేసి గోడ నిర్మించటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారని వెంటనే గోడను తొలగించాలని కోరుతూ మంగళవారం సికింద్రాబాద్‌లోని రైల్వే నిలయంలో డిజిఎం ఉదయ్‌నాథ్‌ను కలిసి రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి వినతి పత్రం అందజేశారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌కు చెందిన ముఖ్య నాయకులు కలిసి ఈ విషయమై చేవెళ్ల ఎంపి కొండ విశ్వేశ్వర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. వెంటనే ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి స్పందించి తన కార్యాయం నుంచి ఇచ్చిన వినతి ప్రతి బాధిక సంబంధించిన వినతి పత్రాన్ని రైల్వే డిజిఎం ఉయద్ నాథ్‌కు అందజేయటంతో పాటు సమస్యను పరిష్కరించాలని తోకల శ్రీనివాస్ రెడ్డి కోరారు. శివరాం పల్లి గేటు వద్ద రోడ్డుకు అడ్డంగా నిర్మించిన గోడను తొలగించాని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బిజెపి అధ్యక్షులు గోదా పాండు యాదవ్, బిజెపి సీనియర్ నాయకులు సంతు గౌడ్, మధుసూధన్ రెడ్డి, గోపాల్ నాయక్ పాల్గొన్నారు.

### వాల్ పోస్టర్ విడుదల చేసిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి


వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి

**చార్మినార్, జూన్ 17 ప్రభాతవార్త :**
కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మంగళవారం షియా ముస్లింకు సంబంధించిన ఈద్-ఇ-ఘదీర్ పండుగ వాల్ పోస్టర్‌ను మాజీ రాష్ట్ర బిజెపి మైనార్టీ మోర్చ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీతో కలిసి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి ప్రధాన కార్యదర్శి గుజ్జల ప్రేమేందర్ రెడ్డి, డాక్టర్ జి.మనోహర్‌రెడ్డి, శ్రీనివాస్ నేతాతో పాటు పలువురు పాల్గొన్నారు.

### హాఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ బ్రిడ్జిని గ్రేటర్ కమిషనర్‌తో కలిసి సందర్శించిన జగదీశ్వర్‌గౌడ్



**శేరిలింగంపల్లి, జూన్17 ప్రభాతవార్త**
హాఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ నందు నూతనంగా చేట్టాల్సిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యులు, శేరిలింగంపల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ అధికారులను కోరారు. హాపీజ్‌పేట్ డివిజన్‌పరిధిలోని హాఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ నందు నూతనంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులను జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, డీసీ మోహన్‌రెడ్డి, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ ఎస్‌సీ శంకర్‌నాయక్‌లతో కలిసి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ. హాఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ నందు ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తిచేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ శ్రీదేవి, ఏఈ ప్రతాప్, అధికారులతో కలిసి స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారం

## -చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

**నవాబుపేట, జూన్ 17, ప్రభాతవార్త:**
ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల ద్వారా సంబంధిత భూ సమస్యలను సత్వర పరిష్కారం చేయాలని చేవెళ్ళ ఎమ్మెల్యే కాలె యాదయ్య చెప్పారు. మంగళవారం మండల పరిధిలోని ఎల్లకొండలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొని ప్రసంగించారు. ప్రజల నుండి అందిన ప్రతి సమస్యను పరిష్కారం చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలు ప్రభుత్వంపై నమ్మకంతో అర్జీలు పెట్టుకుంటారని ఈనేపథ్యంలో అదేనమ్మకంతో అధికారులు సమస్యలను పరిష్కరించాలని అన్నారు. స్థానికంగా పరిష్కారానికి వీలైనవాటిని ఆలస్యం చేయకుండా పరిష్కరించాలన్నారు. ప్రజలతో సన్నిహితంగా మెలగాలని సమస్యల పట్ల ఉదాసీనతతో వ్యవహరించాలన్నారు. ప్రజలను ఇబ్బంది పెట్టే ఎలాంటి చర్యలను ఉపేక్షించేది లేదని ఆయన చెప్పారు. తహసీల్దార్ బుచ్చయ్య మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో అందిన ఫిర్యాదులను క్షుణంగా పరిశీలిస్తామని చెప్పారు. సమస్యలను క్లుప్తంగా వివరించాలని అన్నారు. ఈనేనథ్యంలో సమస్య పరిష్కారానికి సులభతరంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బుచ్చయ్య, ఉపతహసీల్దార్ శ్రీలత, ఆర్ఐలు రజిత, రాజు, రెవెన్యూ సిబ్బంది మహమ్మద్‌ఆలీ, పరమేశ్, మౌనిక, మాహబూబ్ జాని, శ్రీశైలం, పాషా, రాహుఫ్, నర్శింములు, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎల్లకొండ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య

## భవానీమాత ఆలయంలో ప్రత్యేక పూజలు

-పూజలు చేసిన బిఆర్ఎస్ నాయకుడు రవీందర్‌యాదవ్


పూజలు చేస్తున్న రవీందర్‌యాదవ్

**షాద్‌నగర్, జూన్ 17, ప్రభాతవార్త:**
జానంపేట భవానీమాత ఆలయంలో బిఆర్ఎస్ యువ నాయకుడు వై.రవీందర్‌యాదవ్ మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయం ప్రారంభోత్సవం అనంతరం మొదటి మంగళవారాన్ని పురస్కరించుకొని అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని శ్రీ స్వరూపిణిగా, లక్ష్మీదేవిగా ఆరాధించడం హిందూ సంప్రదాయమని, గ్రామీణ, పట్టణ ప్రాంతప్రజలు అమ్మవారికి పూజలుచేయడం ఆనవాయితీ అని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, బిఆర్ఎస్ నాయకులు బర్ల నరసింహ్మ, సుజీవన్, పిల్లి శేఖర్, జూపల్లి శంకర్, చెట్ల నరసింహ్మ, నంద కిశోర్, నందిగామ శ్రీనివాస్, చెట్ల జంగయ్య, నరసింహ్మ, భువనేశ్వర్‌రెడ్డి, గుండు అశోక్, కొండ మల్లేష్, మంగ శ్రీశైలం, చెర్ల శివ, పిట్టల మల్లేష్, రాజు పాల్గొన్నారు.

## సాహితీ విలువలు పెంపొందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న మల్లారెడ్డి

**నవాబుపేట, జూన్ 17, ప్రభాతవార్త:**
ఆధునికయుగం పేరిట రోజురోజుకు సాహితీ విలువలు కనుమరుగు చేస్తున్నారని సాహితీవేత్త తూర్పు మల్లారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పులిమామిడి మఠం వద్ద పద్య పదభారతి సాహితీ స్వచ్ఛంద సంస్థ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సమాజంలో నూతన పోకడలతో పాతకు పాతరేస్తున్నారని ఈనేపథ్యంలో నూతనపదజాలంతో కూడిన సాహిత్యాన్ని మరిచిపోతున్నారని అన్నారు. జానపదకళలు, యక్షగానాలు, ధార్మికప్రసంగాలు, ఇతిహాస సాహిత్యసంబంధ కార్యక్రమాలకు జీవం పోయాలని ఆయన పిలుపునిచ్చారు. నేటియువత పాశ్చాత్య పోకడలతో గత వైభవాన్ని మరిచిపోతున్నారని వాటిని వారిలో తట్టిలేపాలని అన్నారు. అనంతరం పద్య పదభారతిసంస్థ నూతనకమిటీని ఏర్పాటుచేశారు. గౌరవ అధ్యక్షులుగా బందెప్పగౌడ్, వెంకటయ్య, మండల అధ్యక్షునిగా బొజ్జా రాఘవేంద్రాచార్యులు, ఉపాధ్యక్షునిగా పోలే విశ్వనాథం, శ్రీపాదశర్మ, కరణం మాణిక్‌రావు, కార్యదర్శి డాక్టర్ ఎం.రాజు, సహాయ కార్యదర్శులుగా ఇ.సుధాకర్‌గౌడ్, ఘణపురం పరమేశ్వర్, ధర్మపత్ర వెంకట్, సాంస్కృతిక కార్యదర్శిగా మల్లనగెల్లి లాల్‌రెడ్డి, కోశాధికారిగా రెడ్యానాయక్, మీడియా కన్వీనర్‌గా శ్రీనివాసచారి, మోగులయ్య, కార్యాలయ కార్యదర్శిగా దివాకర్‌శాస్త్రి, బండి మల్లికార్జున్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలి


తడి,పొడిచెత్తపై అవగాహనకల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి

**కీసర, జూన్ 17, ప్రభాతవార్త:**
ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 100రోజుల తడిచెత్త పొడిచెత్తపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు విజయపురికాలనీలో తడి,పొడిచెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. కమిషనర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత తడి, పొడిచెత్త, ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా కీటకాలు దరి చేరవని అన్నారు. తడి,పొడి,హానికరచెత్త వేరువేరు చేయాలన్న సందేశాన్ని ప్రజలకు వివరించారు. వీధికుక్కల నియంత్రణ కార్యక్రమాన్ని ప్రజలకు వివరించారు. చెత్తసేకరణలో పాల్గొనే ఆటోడ్రైవర్లకు డబ్బాలు, గ్లౌజులు, యాప్రాన్‌లు పంపిణీచేశారు. 10వవార్డులో హరితపురికాలనీలో నాలాలోని పూడికలు తీసి, వ్యర్థాలను తొలగించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డిఈ సంతోష్‌కుమార్, మేనేజర్ సురేష్‌రెడ్డి, పట్టణ ప్రణాళిక ఇంఛార్జి తిరుపతిరెడ్డి, సానిటరీ ఇన్స్‌పెక్టర్ రాంరెడ్డి పాల్గొన్నారు.

## స్వంత డబ్బులతో డ్వాక్రా మహిళలకు మరుగు దొడ్లనిర్మాణం చేసిన సుష్మామహేందర్‌రెడ్డి


మరుగుదొడ్లను ప్రారంభిస్తున్న సుష్మామహేందర్‌రెడ్డి

**శంషాబాద్. జూన్ 17, ప్రభాతవార్త:**
శంషాబాద్ పురపాలక సంగం పరిధిలోని శాతంరాయి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో మహిళల కోసం నూతనంగా నిర్మించిన మరుగు దొడ్లను సిరి స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షులు. మునిసిపల్ మాజీ చైర్మన్ కొలను సుష్మామహేందర్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. తన స్వంత డబ్బులు ముప్పైవేలు వెచ్చించి నిర్మించిన వాటిని ఆమె ప్రారంభించారు. స్థానిక మాజీకౌన్సిలర్ పోట్నుగటి సునీతదయానంద్ ఆమెను అభినందించారు. కార్యక్రమంలో కొలను రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్ పాఠశాలలకు సహకరించాలి

-డిఇఓను కలిసి వినతిపత్రం అందించిన జిల్లా ట్రస్మా నాయకులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 17, ప్రభాతవార్త:**
బడ్జెట్ పాఠశాలల సమస్యలను దృష్టిలో ఉంచుకని యాజమాన్యాలకు సహకరించాలని మేడ్చల్ జిల్లా డిఇఓ విజయకుమారిని జిల్లా ట్రస్మా ప్రతినిధులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా విద్యా అధికారి కార్యాలయంలో ట్రస్మా ప్రతినిధులు మర్యాదపూర్వకంగా ఆమెను కలిసి బడ్జెట్ స్కూల్స్‌కు సహకరించాలని వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లా ట్రస్మా నూతన కమిటీ అధ్యక్షులుగా ఎన్నికైన శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అంజనేయులు, కోశాదికారి గిరిబాబులు డిఇఓను కలిసి సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రామేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఈమధ్యకాలంలో బడ్జెట్ పాఠశాలలను ఇబ్బందులు పెట్టేవిధంగా ఎలాంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా పాఠశాలలు పుట్టుకొస్తున్నాయని, వీటిని తల్లిదండ్రులు అప్రమత్తం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు జిల్లా ట్రస్మా జిల్లా నాయకులు గడ్డమీది బాల్‌రాజ్, వినోద్, పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ చేసి సాధించింది ఏమిటి..?

-బిజెపినేత పాలమూరు విష్ణువర్థన్‌రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పాలమూరు విష్ణువర్థన్‌రెడ్డి

**షాద్‌నగర్, జూన్ 17, ప్రభాతవార్త:**
బిఆర్ఎస్ నాయకులు రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించి వ్యక్తిగత గోప్యతను హరించారని, తమ సంభాషణలు బహిర్గతం చేసి చివరకు సాధించింది ఏమిటని షాద్‌నగర్ బిజెపినేత, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్థన్‌రెడ్డి సంచనల వ్యాఖ్యలుచేశారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జుబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక పోలీసు అధికారి ఎసిపి వెంకటగిరి నేతృత్వంలో తన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై విచారణ జరిగిందని స్పష్టం చేశారు. ఎన్నికల సందర్భంగా తనను అనేకరకాలుగా ఇబ్బందులకు గురి చేశారని, అందులో భాగంగానే తన ఫ్యాక్టరీ, ఇతర వ్యాపార సంస్థలు, ఎన్నికలకు సంబంధించిన వ్యవహారంలో 8 కేసులు నమోదు చేశారని, పక్కా పథకం ప్రకారమే ఫోను ట్యాపింగ్ చేశారని ఆరోపించారు. తనతో వ్యాపారస్థులు, నాయకులు, కార్యకర్తలు, జర్నలిస్టులు, న్యాయవాదులు, ఎన్నో రంగాలకు చెందినవారు ఎన్నో విషయాలు మాట్లాడారని, ఇప్పుడు వారందరి మాటలువిని వాళ్లను టార్గెట్ చేస్తారా.? అని ప్రశ్నించారు. వ్యక్తిగత గోప్యతను హరించడం చాలా నేరమని, రాజ్యాంగం కల్పించిన హక్కుల్లో ఇది ప్రధాన స్వేచ్ఛాహక్కు అని, ఇది తన ఒక్కడితో ఆగిపోలేదన్న అనుమానాన్ని ఆయన వ్యక్తంచేశారు. ఈ విలేకరుల సమావేశంలో బిజెపి నాయకులు మోహన్‌సింగ్, లష్కర్‌నాయక్, ఆయా మండలశాఖ అధ్యక్షులు అత్తాపురం మహేందర్‌రెడ్డి, చిట్టెం లక్ష్మీకాంత్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, అనిల్‌కుమార్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో ఎమ్మెల్యే


ఫొటో. 01.రైటప్.ఇంటి గృహప్రవేశం చేసిన ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి

**దోమ, జూన్ 17, ప్రభాతవార్త:**
ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను త్వరితగతిన పూర్తిచేయుటకు అధికారులు, లబ్దిదారులు ముందుకురావాలని పరిగి ఎమ్మెల్యే టి.రాంమోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం దోమ మండలపరిధిలోని శివారెడ్డిపల్లి గ్రామానికి చెందిన సుజాత ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తి చేసుకొని గృహ ప్రవేశం చేసిన సందర్భముగా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భముగా మొట్ట మొదటగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తిచేసిన సుజాతను అభినందించారు. కార్యక్రమములో ఆర్‌డివో వాసుదేవ్, ఎంపిడివో గ్యామా, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు విజయకుమార్‌రెడ్డి, గ్రామ మాజీసర్పంచ్ నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాఘవేందర్‌రెడ్డి, బంగ్లయ యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు సొసైటీలు దేవాలయాలు: డిసిఓ

**ఘట్‌కేసర్, జూన్ 17, ప్రభాతవార్త:**
దేశంలో హరితవిప్లవం ద్వారా ఆహార ఉత్పత్తులకు ప్రాధాన్యత ఏర్పడి, వ్యవసాయంతో ద్రవ్యోల్బం నివారించడం జరుగుతుందని సహకారశాఖ జాయింట్ డైరక్టర్ (తెలంగాణ కోఆపరేటివ్ యూనియన్ ఎండి) అన్నపూర్ణ పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ ఈయర్ ఆఫ్ కోఆపరేటివ్స్ 2025 సందర్భంగా ఘట్‌కేసర్ రైతుసేవా సహకార సంఘంలో మంగళవారం హైదరాబాద్ నిజాం కళాశాల విద్యార్థులకు కోపరేటివ్ ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జాయింట్ రిజిస్ట్రార్ దాత్రి, జాయింట్ రిజిస్ట్రార్ పరిమళ, జాయింట్ రిజిస్ట్రార్-మేడ్చల్ జిల్లా ఇంచార్జ్ సురేఖ, జాయింట్ రిజిస్ట్రార్ సంజీవ, శిక్షకురాలు వల్లి శ్రీవిద్య, సొసైటీ మేనేజర్ జయప్రకాష్, డైరక్టర్లు రేసు లక్ష్మారెడ్డి, జిల్లాల పోచిరెడ్డి, ఇటికాల రామకృష్ణారెడ్డి, గోపు బాల్‌రాజ్‌యాదవ్, గ్యార వెంకటేశ్, మహేందర్‌నాయక్ పాల్గొన్నారు.

## బిజెపితోనే సామాజిక న్యాయం

-గిరిజన మోర్చ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రవినాయక్


సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి నాయకులు

**షాద్‌నగర్, జూన్ 17, ప్రభాతవార్త:**
బిజెపితోనే సామాజిక న్యాయం సాధ్యమని, ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేదల పక్షపాతి అని బిజెపి గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలో గిరిజన మోర్చ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని గిరిజన మోర్చా ఇంచార్జి మోహన్‌సింగ్ అధ్యక్షతన ఏర్పాటుచేయగా ఈసమావేశానికి గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయక్, బిజెపి జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజభూపాల్‌గౌడ్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్థన్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ పేదల పక్షపాతి అని అన్నారు. కార్యక్రమంలో గిరిజన మోర్చా జిల్లా నాయకుడు లష్కర్‌నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి వినోద్‌నాయక్, రాజునాయక్, శివనాయక్, రాజు నాయక్, మోహన్‌నాయక్, లింగంనాయక్, మున్సిపాలిటీ అధ్యక్షుడు హరి భూషణ్, అప్పోజు విజయ్ భాస్కర్, ఇస్నాతి శ్రీనివాస్, సుధాకర్ అప్ప, చిట్టెం లక్ష్మీకాంత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, ఎదిర రాజు, శ్యాంసుందర్‌రెడ్డి, శివారెడ్డి, మిద్దె గణేష్, బాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## తంగడ్‌పల్లిలో మంచినీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం

-ముడిమ్యాల సహకార సంఘం చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి


బోర్‌మోటర్‌ను స్విచ్ ఆన్‌చేసి ప్రారంభిస్తున్న గ్రామస్థులు


**చేవెళ్ల, జూన్ 17, ప్రభాతవార్త:**
తంగడ్‌పల్లిలో మంచినీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు శాయశక్తుల కృషి చేస్తానని ముడిమ్యాల సహకార సంఘం చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి అన్నారు. తంగడ్‌పల్లి గ్రామంలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని గ్రామస్థులందరు ముడిమ్యాల సహకార సంఘం చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డిని కోరడంతో వెంటనే ఆయన స్పందించి 2లక్షల రూపాయలతో బోరు వేయించి, మోటర్‌ను ఫిట్ చేసి, మంగళవారం గ్రామస్థులతో స్విచ్ ఆన్ చేయించారు. తంగడ్‌పల్లి గ్రామంలోని హనుమాన్ దేవాలయం నిర్మాణానికి తనవంతు సహాయంగా లక్ష51వేల రూపాయలను, లక్ష్మీవేంకటేశ్వర బ్రహ్మోత్సవాలకు 51వేలరూపాయలను గ్రామస్థులకు విరాళంగా అందజేశామన్నారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ డైరెక్టర్ పాండు, మాజీసర్పంచ్ సత్తయ్యగౌడ్, రాములుగౌడ్, సయ్యద్‌గయాస్, శ్రీనివాస్‌గౌడ్, చంద్రయ్యగౌడ్, రాఘవేందర్ రెడ్డి, సుధాకర్‌గౌడ్, ఆజీమ్, శ్రీకాంత్‌రెడ్డి, నర్సి రెడ్డి పాల్గొన్నారు

## కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

-కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పల్లె ఆనంద్‌కుమార్

**కేశంపేట, జూన్ 17, ప్రభాతవార్త:**
మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలలో అన్ని స్థానాలు గెలిచి వీర్లపల్లి శంకర్ అన్నకు బహుమతిగా ఇద్దామని అన్నారు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొండారెడ్డిపల్లి గ్రామానికిచెందిన పల్లె ఆనంద్‌కుమార్. షాద్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే శంకర్ అన్న నిరంతరం పనిచేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్‌పార్టీ బలోపేతానికి నాయకులందరూ సమన్వయంతో పనిచేసి రానున్న స్థానికసంస్థల ఎన్నికలలో జెడ్పిటిసి, ఎంపిటిసి, సర్పంచ్, వార్డుమెంబర్ స్థానాలను అధికసంఖ్యలో గెలుచుకోవాలని అధికారమే లక్ష్యంగా అందరం పనిచేయాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. కేశంపేటలో అన్నిస్థానాలు గెలిచి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు మరింత అండగా ఉండాలని మండలంలోని కాంగ్రెస్ కార్యకర్తలకు ఆనంద్‌కుమార్ పిలుపునిచ్చారు..

# అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేసిన ఎమ్మెల్యే


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

**శంషాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:**
శంషాబాద్ మున్సిపాలిటీ లోని 25 వార్డులో రూ 11 కోట్లతో సీసీ రోడ్లు , అండర్ గ్రౌండ్ డ్రైనేజ పనులను నూతన బీటి రోడ్డు పనులకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మంగళవారం శకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్నదని అన్నారు . ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు నిరంతర ప్రక్రియగ కొనసాగుతుందని పేర్కొన్నారు. పేద ప్రజలకు జీవితంలో ఆదరణ,భరోసా కల్పించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రవేశ అమలు చేస్తున్నారని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు చిత్త శుద్ధితో ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుమన్ రావు. ఏ ఈ నరేష్. మున్సిపల్ మాజీ చైర్మన్ సుష్మ మహేందర్ రెడ్డి. మాజీ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్. మాజీ సర్పంచ్ గణేష్ గుప్తా. పార్టీ సీనియర్ నాయకులు కొడిగంటి చంద్రారెడ్డి. దూడల వెంకటేష్ గౌడ్. మాజీ కౌన్సిలర్లు చెన్నం అశోక్. మేకల వెంకటేష్. పారేపల్లి లావణ్య శ్రీనివాస్ గౌడ్. సంజయ్ యాదవ్. అజయ్. సునీత దయానంద్ . తోకల మురళి యాదవ్. పెదిరిపాటి ప్రవీణ్ గౌడ్. కోణముల శ్రీనివాస్ .మాజీ సర్పంచ్ జిట్టేసిద్దులు. గొరిగే నందరాజు గౌడ్. బొబ్బిలి కృష్ణయ్య మహేందర్ ముదిరాజ్ శేఖర్ ముదిరాజ్. కొండ గణేష్ గౌడ్. తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సేవలు అమోఘం..!

-చేగూరు జిపి భవన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు
-హర్షం వ్యక్తంచేసిన గ్రామస్థులు


ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్న చేగూరు గ్రామస్థులు

**నందిగామ, జూన్ 17, ప్రభాతవార్త:**
నందిగామ మండలం చేగూరులో శిధిలావస్థకు చేరుకున్న గ్రామపంచాయతీ నిర్మాణ భవనానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఎన్ఆర్జిఎస్ నిధులు రూ.20 లక్షలు మంజూరు చేసినందుకు చేగూరు గ్రామస్థులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. వారంరోజుల క్రితం ఇందిరమ్మ ఇళ్ల భూమిపూజకు చేగూరుకువచ్చిన ఎమ్మెల్యేను మీరే దిక్కు అంటూ మాజీ ఎంపిపి ఎం.శివశంకర్ గౌడ్‌ఆధ్వర్యంలో గ్రామస్థులు మొరపెట్టుకోవడంతో ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి పంచాయతీ భవనాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చినమాట ప్రకారం ఎమ్మెల్యే రూ.20 లక్షలు ఎన్ఆర్జిఎస్ నిధులు మంజూరు చేసినందుకు గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మంకాల శ్రీశైలం, ఆవుల శివశంకర్, పబ్బే శ్రీశైలం, రవితేజ, భాస్కర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రాజుగౌడ్, పబ్బె నరేందర్, యాదయ్య, ఎలికట్ట కృష్ణయ్య, గిరిగౌడ్, నర్సింగ్‌రావు, మంగలిశ్రీను, గిరి, కొత్తూరు రాజు, దొర కృష్ణ, పబ్బే నరేందర్,రమేష్‌ప్రవీణ్,మహేష్ ఉన్నారు.

## ఫార్మాసిటీ భూములన్ని రైతులకే వర్తించాలి: దోస రమేష్


సదస్సులో తహసీల్దార్ అయ్యప్ప, మాజీసర్పంచ్ రమేష్, ఆర్ఐ రామకృష్ణ

**యాచారం, జూన్ 17, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని తాడిపర్తి గ్రామంలో ఫార్మాసిటీ భూసేకంలో లేని భూములకు బిరాసత్తులు అనువంశికం వారసత్వం సంబంధించిన వాటికి అరులైన ప్రక్రియ జరిపించాలని గ్రామస్థులు విన్నవించారు. తాడిపర్తిగ్రామంలో రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ అయ్యప్ప, ఫార్మాసిటీ సిఐ కృష్ణంరాజు, అరేయ్ రామకృష్ణ ఆధ్వర్యంలో సదస్సులను కార్యక్రమంలో భాగంగా ఫార్మాసిటీ భూసేకరణలో లేని సర్వే నెంబర్లు అయిన 114,109,118గల భూమికిసంబంధించిన విరాసత్తులను ఆనువంశికంగా ఉన్న వారసత్వ సంక్రమించే భూమి విస్తీర్ణం పేర్లు తేడాలు రావడం కొనుగోలు చేసిన భూమి స్వభావం తేడాలు రావడం వాటి పైన 51 దరఖాస్తులు ఉన్నాయని వాటిని పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. ఫార్మసిటీ కోసం సేకరించిన భూముల్లో ఫార్మాకు రైతులు రైతుబంధు, క్రాప్‌రుణాలు కూరగాయల రైతు పేరుతో తొలగించి టిఎస్ ఐఐసి మార్పిడి చేసిన వారిని వెంటనే తొలగించి రైతు పేరు ఎక్కించాలని కోరారు. ఆనువంశికంగా విరాసత్తులు కావడంలాంటి తక్షణమే హక్కులు కల్పించాలని తహసీల్దార్‌కు సర్పంచ్ దూసర రమేష్ విన్నపించారు. టిజెఎస్ పార్టీ ఇన్చార్జ్ నాయకులు సోమయ్య ఇందిరమ్మ కమిటీ సభ్యులు డైరెక్టర్ జంగయ్యలు కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

## శాంతిభద్రతల పరిరక్షణలో దేశంలోనే తెలంగాణ పోలీస్ మొదటి స్థానం..

-డిజిపి డాక్టర్ జితేందర్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డిజిపి జితేందర్

**వికారాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:**
శాంతిభద్రతల పరిరక్షణలో తెలంగాణ పోలీస్ మొదటి స్థానంలో నిలిచిందని డిజిపి డాక్టర్ జితేందర్ అన్నారు. జిల్లాల పర్యటనలో భాగంగా మంగళవారం వికారాబాద్ జిల్లాను సందర్శించి జిల్లా ఎస్పీ కార్యాలయంలో పోలీసు అధికారులతో పలుఅంశాలపై సమీక్షాసమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డిజిపి మాట్లాడుతూ, డయల్ 100కి మంచి స్పందన లభించిందని, డయల్ 100ద్వారా సామాన్యులకు సైతం సత్వర న్యాయం చేకూరుతుందని తెలిపారు. సైబర్‌నేరాలు తగ్గుముఖం పట్టాయని, ఎప్పటికప్పుడు సైబర్ నేరాలను అరికడుతూ బాధితులకు న్యాయంచేసే దిశగా సైబర్ పోలీసు విభాగం పనిచేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంవ్యాప్తంగా 9సైబర్ పోలీస్‌స్టేషన్లు కొనసాగుతున్నాయని, మిగతాచోట్ల సైబర్‌నేరాల నియంత్రణపై పోలీసు అధికారులకు తర్ఫీదునిచ్చి సైబర్‌నేరాలను ఆదిలోనే అంతం చేస్తున్నామని అన్నారు. గంజాయి విషయానికి వస్తే, రాష్ట్రంలో గంజాయి ఉత్పత్తి పూర్తిగా తగ్గిపోయిందని, సరిహద్దు రాష్ట్రాల నుంచి గంజాయి సరఫరా అవుతున్నట్లు తమదృష్టికి వచ్చిందన్నారు. గంజాయి సరఫరా అడ్డుకునేందుకు తగుచర్యలు తీసుకోవడం జరిగిందని, ఇందులోభాగంగా గతసంవత్సరం 30వేల కిలోల గంజాయిని పోలీసుశాఖ పట్టుకుని నేరస్తులకు శిక్షలు పడేలా కృషి చేసిందని తెలిపారు. నార్కోటిక్ నియంత్రణలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నలిచిందని గుర్తుచేశారు. నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు జిల్లాస్థాయిలో ప్రత్యేక కమిటీని వేయడం జరిగిందని తెలిపారు. అధిక మొత్తంలో నకిలీ విత్తనాలు సరఫరా చేసినట్లు తెలిస్తే బాధ్యులపై పిడి యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి ప్రమాదాలను నివారించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు డిజిపి తెలిపారు. ఈ సమావేశంలో మల్టీ జోన్-2 ఐజిపి వి.సత్యనారాయణ, చార్మినార్ జోన్ డిఐజి తస్వీర్ ఇక్బాల్, జిల్లా ఎస్పీ కె.నారాయణరెడ్డి పాల్గొన్నారు.

## ప్రభుత్వ చీఫ్‌విప్‌ను కలిసిన నేతలు

**షాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:**
తెలంగాణ ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డిని శ్రీబుగ్గ రామలింగేశ్వర స్వామి దేవాలయం కమిటీ చైర్మన్‌తో పాటు సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పట్నం మహేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఆలయం శిథిలావస్థకు చేరుకుందని ఆలయ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించాలన్నారు. అదే విధంగా కొమరబండ నుండి బొబ్బిలిగామ, దోస్వాడ బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రభుత్వంతో చర్చలు జరిపి నిధులు వచ్చేలా కృషి చేయాలని కోరగా అందుకు పూర్తిస్థాయి సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారన్నారు.
ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ వెంకటయ్య, మాధవరెడ్డి, రాణి, నరహరిచారి, సుభాష్ చంద్రబోస్, దామర్లపల్లి మాజీ సర్పంచ్ బర్ల యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.